


**(గత సంచిక తరువాయి)**

**చర్చ్‌నించి తిరిగి** వచ్చాక ఆద్యకి తన రంగు చర్మంగల మనిషి మొదటి ఇంట్లో కనిపించాడు. కిటికీలోంచి ఆద్యని చూడగానే తను బయటకి వచ్చి తలుపు తాళం తీసే ఆద్యతో చెప్పాడు.

"గుడ్ మార్నింగ్. నా పేరు ప్రియాంక్."

తెలుగు మాటలు వినగానే అతని వంక చూసి నవ్వి చెప్పింది.

"నా పేరు ఆద్య. చైత్ర చెల్లెల్ని."

"ఓ! నేను రావచ్చా?" అడిగాడు.

"తప్పకుండా."

ఆరడుగుల ఎత్తున్న అతని వయసు ముప్పై పైనే ఉంటుంది అనుకుంది.

"మీది ఎక్కడ? ఆంధ్రప్రదేశా? తెలంగాణానా?" ఇద్దరూ కూర్చున్నాక అడిగింది.

"రెండూ కాదు. దుబాయ్. మా నాన్నగారిది ఖమ్మం జిల్లాలోని వైరా అనే ఊరు. మా అమ్మది చెర్ల. నేను పుట్టి పెరిగింది దుబాయ్‌లోనే. అదే నా పాలిట శాపమైంది. నేను స్క్లంబర్జేలో ఎకౌంట్స్ విభాగంలో పనిచేస్తున్నాను. వారం రోజుల పనికి కెనడాలోని నా బేస్‌నించి వచ్చాను."

"కాఫీ?" అడిగింది.

"తప్పకుండా."

"దుబాయ్ నచ్చలేదా?" కాఫీ కప్పు అందించి అడిగింది.

"నాదో చిత్రమయిన కథ. నేను ఇండియన్ పేరెంట్స్‌కి దుబాయ్‌లో పుట్టి అక్కడే పెరిగాను. స్కూల్, కాలేజ్ చదువు అక్కడే. కాని నాకు దుబాయ్ పౌరసత్వం లేదు. ఎమిరాతీకి జన్మిస్తేనే దుబాయ్ పౌరసత్వం వస్తుంది. ఇంజనీరింగ్ కోర్స్ ఆస్ట్రేలియాలో చేసాను. కాని ఏలియన్ని కాబట్టి దుబాయ్‌లో ఉండాలంటే నాకు తప్పనిసరిగా అక్కడ ఉద్యోగం ఉండాలి. ఉద్యోగం పోతే, నెలలోగా ఇంకో ఉద్యోగం సంపాదించుకోలేకపోతే ఆ దేశం వదిలి వెళ్ళిపోవాలి. నా తల్లితండ్రుల దేశమైన ఇండియాకి నేను ఎన్నడూ వెళ్ళలేదు. ఎప్పుడో చిన్నప్పుడు రెండు మూడుసార్లు వెళ్ళానంతే. పాస్‌పోర్ట్ ఉన్నా ఇండియా

నాకు విదేశంలాంటిదే, కాబట్టి నేను ఇండియాకి వెళ్ళినా ఎలా జీవించాలో కూడా తెలీదు. మాతృభాషని ఇంట్లో మా పేరెంట్స్ మాట్లాడతారు కాబట్టి మా అందరికీ తెలుగు వచ్చింది."

అతను చెప్పేది ఆద్య శ్రద్ధగా వింటోంది.

"దుబాయ్‌లో నా జీవితం చాలా వత్తిడితో సాగిందనే చెప్పాలి. మా నాన్న తరచు స్థానికులతో గొడవ పడొద్దని, లేదా దేశంలోంచి పంపిచేస్తారని చెప్తూండేవాడు. అక్కడ ప్రతీది నేరమే. పబ్లిక్‌లో తిట్టుకోవడం, కొట్టుకోవడం నేరం. ఎవరినైనా వీడియో తీయడం నేరం. గవర్నమెంట్ బిల్డింగ్స్‌ని ఫోటో తీయడం నేరం. దుబాయ్ ప్రభుత్వాన్ని కాని, షేక్‌ని కాని విమర్శించడం నేరం. ఇలా నేరాల జాబితా చాలా ఉంది."

"అయ్యో!"

"ఉద్యోగం లేక నేను పుట్టి పెరిగిన దుబాయ్‌కి, నా కుటుంబానికి దూరమవాల్సి వచ్చింది. ప్రస్తుతం కెనడా తమ దేశానికి వలసలని ప్రోత్సహిస్తోంది. దాంతో వారి పరిక్ష రాసి పి.ఆర్.కోసం ప్రయత్నించాను. వచ్చింది. నియమిత దినాలు కెనడాలో ఉంటే తర్వాత పౌరసత్వం లభిస్తుంది. అది తీసుకున్నాక ఊపిరి పీల్చుకున్నాను. ఓ రోజు దుబాయ్ షేక్ ఫలానా కంపెనీలో కేవల స్థానిక ఎమిరాతీలే ఉండాలని నిర్ణయిస్తే వేలమంది ఉద్యోగస్థులు స్వదేశం దారి పట్టాలి. కెనడాలో అలాంటి సమస్య లేదు. ఉద్యోగం లేకపోయినా అక్కడనించి నన్నెవరూ గెంటేయరు. నేను పుట్టి పెరిగిన దేశానికి నా కుటుంబాన్ని చూడటానికి విజిటర్‌గా వెళ్ళాల్సిన ఖర్మ నాది. నా పిల్లలు ఇద్దరూ కెనడాలో పుట్టారు. కాబట్టి వారికి కెనేడియన్ పాస్‌పోర్ట్ వచ్చింది."

"దుబాయ్ గురించి చాలా సమాచారం చెప్పావు. ఇదంతా నాకు తెలిదు" ఆద్య చెప్పింది.

"క్రితం ఏడాది కూడా ఆడిటింగ్‌కి వచ్చినప్పుడు చైత్రకి చెప్పాను. నీకూ చెప్పాలనుకున్నాను. చెప్పాను. కాఫీ తాగాను. వెళ్తాను."

అతనికి తన మాటలకి తనకే ఫక్కున నవ్వొచ్చింది.

ఆ సాయంత్రం చైత్ర ఆఫీస్‌నించి త్వరగా వచ్చింది. ప్రియాంక్ గురించి చెపితే అడిగింది.

"అవును. నీకు జోక్ ఏదైనా చెప్పాడా?"

"లేదే?"

"ఓసారి ఉగాదికి తన అరబ్ మిత్రుడిని భోజనానికి పిలిచాడు. పూర్తిగా వెజిటేరియన్ అని ముందే చెప్పాడు. అరిటాకు వేసి నీళ్ళు పెట్టి పాయసం తీసుకురావడానికి లోపలికి వెళ్ళాడు. అతను ఆ గిన్నెతో బయటకి రావడానికి కొద్దిగా ఆలస్యమైంది. ఈలోగా మనవాడు అరిటాకుని మొత్తం తినేసి, మంచినీళ్ళు తాగాడు. పైగా ఇంతపెద్ద సలాడ్ ఆకుని నేను ఎక్కడా చూడలేదు అన్నాడట."

ఆద్య పగలబడి నవ్వింది.

"అతన్ని కూడా భోజనానికి పిలుస్తావా?" అడిగింది.

"పిలిచాను. అతను ఘానా భోజనం తినడానికి ఎవరితోనో వెళ్తున్నానన్నాడు. అది అతనికి ఇష్టమట."

అలెక్సీ కుటుంబాన్ని డిన్నర్‌కి ఆహ్వానించారు కాబట్టి అన్నం వండి యూట్యూబ్‌లో చూస్తూ పీతలకూర, ఉల్లిపాయ, టొమేటో ముక్కలు వేసి చేసిన పల్చటి పప్పు, సాంబార్, వంకాయ కూర చేసారు. వాళ్ళు వచ్చాక వేడివేడిగా ఆమ్లెట్స్ వేయచ్చు అనుకున్నారు. పిల్లలకోసం తొక్కని తీసేసి పొడిచేసిన ఏలకులు, కిస్‌మిస్, జీడిపప్పు వేసి కండెన్స్‌డ్ మిల్క్‌తో అన్నం పాయసం చేసారు. చైత్ర వైన్ సీసాని, గ్లాసులని బల్లమీద ఉంచింది.

వాళ్ళు సరిగ్గా ఏడున్నరకి వచ్చారు. ఇండియాలోలా ఆంటీ అని కాక పిల్లలు చైత్ర, ఆద్యలని పేర్లతో గ్రీట్ చేసారు. ఇలియా ఆద్యకి ఇచ్చిన గిఫ్ట్‌రాప్ చేసిన పెట్టెలో 'థింకింగ్ మేన్' ఉడ్ కార్వింగ్ ఉంది. ఓ కాలుని నేలమీద వుంచి, రెండో కాలిని దాని మోకాలి మీద ఉంచి కూర్చుని, కుడిచేతి గుప్పిటని గడ్డం కింద ఉంచిన పోజులోని ఆ నల్ల మనిషి బొమ్మ ఆద్యకి నచ్చింది. దాన్ని కకుం ఫారెస్ట్ సావనీర్ షాప్‌లో చూడబట్టి అది ఘానా ఉత్పత్తి అని గ్రహించింది.

"థాంక్స్ ఏ లాట్. ఐ లవ్ ఇట్" చెప్పింది.

వాళ్ళు వచ్చిన కాసేపటికి ఆద్య ఇండియానించి తెచ్చిన చింగ్స్ రెడీ టు సర్వ్ చికెన్ సూప్‌ని తయారు చేసింది. తర్వాత మైక్రోవేవ్ ఓవెన్‌లో అప్పడాలని కాల్చింది. చైత్ర ఆమ్లెట్స్ వేసింది .అంతా బల్ల చుట్టూ కుర్చున్నారు.

"ఐ లైక్ గార్లిక్ పాపడ్" ఇలియా దాన్ని తింటూ చెప్పింది.

ఆద్య సూచన ప్రకారం అప్పడాన్ని ముక్కలు చేసి సాంబార్ అన్నంలో వేసుకుని తింటూ చెప్పింది.

థాంక్స్. ఇట్ టేస్ట్స్ మోర్ డెలిషియస్."

"నిజానికి ఇండియాలో ఈ సాంబార్లో చాలా కాయగూరల ముక్కలు వేస్తాం. అదింకా రుచిగా ఉంటుంది. ఇక్కడ కేవలం వంకాయ, ఉల్లిపాయలు, ముల్లంగి, టొమేటో మాత్రమే వేసాం" ఆద్య చెప్పింది.

"పప్పన్నం ప్రొటీన్" పిల్లలు దాన్ని తింటూంటే చైత్ర చెప్పింది.

"రెండు వాక్యాల కథలు చెప్తావా?" భోజనాలయ్యాక ఆద్య అలెక్సీని అడిగింది.

"రెండు వాక్యాల కథలు కాదు కాని రెండు ఆధునిక సంఘటనల్లోంచి రెండు మోరల్స్‌ని చెప్తాను."

"దట్ ఉడ్ బి బెటర్" చైత్ర ఆసక్తిగా చెప్పింది.

"ముందుగా ఇది. మనిషి నియమాలని ఉల్లంఘిస్తే జైలుకి వెళ్తావు. దైవనియమాలని ఉల్లంఘిస్తే నరకానికి వెళ్తావు. ఫిజిక్స్ నియమాలని ఉల్లంఘిస్తే స్వీడన్‌కి వెళ్ళి నోబుల్ ప్రైజ్‌ని స్వీకరిస్తావు."

"వెరీ ట్రూ" చైత్ర నవ్వింది.

"గూగుల్ ఏండ్రాయిడ్‌ని కొన్నది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాంని, వాట్సప్‌ని కొన్నది.

మోరల్ ఒన్: నీ శత్రువులని నీ మిత్రులుగా మలచుకో."

"అబ్రహాం లింకన్ కూడా ఇదే చెప్పాడు."

"మోరల్ టు: త్వరగా ఎదిగి పెద్దవాడై, పోటీని తొలగించు."

"ఇదే కట్‌త్రోట్ వ్యాపారమంటే" ఇలియా చెప్పింది.

"బరాక్ ఒబామా ఐస్‌క్రీం సెల్లర్.

ఎలన్ మస్క్ లంబర్ మిల్ వర్కర్.

మోరల్ ఒన్: వారి పాత ఉద్యోగాలని బట్టి మనిషిని అంచనా వేయకు.

"అవును. మా ప్రధాన మంత్రి మోడీ కూడా టీ హాకర్: చైత్ర చెప్పింది.

మోరల్ టుః నీ వర్తమానం నీ భవిష్యత్‌ని నిర్ణయించదు .నీ పట్టుదలే అది నిర్ణయిస్తుంది."

"ఇన్‌స్పైరింగ్" ఆద్య చెప్పింది.

"కల్నల్ సేందర్స్ కె.ఎఫ్.సి.ని తన అరవై ఐదో ఏట స్థాపించాడు. కె.ఎఫ్.సి తిరస్కరిస్తే జాక్ మా ఆలీబాబాని స్థాపించాడు.

మోరల్ ఒన్: వయసనేది కేవలం ఓ సంఖ్య మాత్రమే. నువ్వే వయసులో ఉన్నా నువ్వు సాధించాలనుకున్నది సాధించచ్చు."

"అగైన్ ఇన్‌స్పైరింగ్."

"మోరల్ టు: జీవితంలో అపజయాలని పట్టించుకోకుండా విజయ ప్రయత్నాలని కొనసాగించేవారే గెలుస్తారు."

ఈ అంతర్జాతీయ విషయం ఆద్యకి అర్థం కాలేదు.

"మీ ఇన్‌స్పిరేషన్‌తో నేనొకటి చెప్పనా?" చైత్ర అడిగింది.

"తక్షణం" అలెక్సీ నవ్వుతూచెప్పాడు.

"ఫెరారీ యజమాని ఓ ట్రాక్టర్ మేకర్ని అవమానించాడు. ఆ ట్రాక్టర్ మేకర్ లంబోర్ఘినీని సృష్టించాడు.

మోరల్ ఒన్: ఎవర్నీ తక్కువగా అంచనా వేయకు. అగౌరవంగా చూడకు.

మోరల్ టు: విజయమే గొప్ప ప్రతీకారం.

"చాలా బావుంది" ఇలియా మెచ్చుకుంది.

"మీ మాటలు చాలా తెలివిగా, ఇన్‌స్పైరింగ్‌గా ఉంటాయి" ఆద్య అలెక్సీని మెచ్చుకుంది.

"ఆద్యా! ఓ కారు చక్రం బురదలో దిగి కదలకపోతే దానికి అసలు పరిష్కారం దానికి మూడు గుర్రాలని కట్టాలన్నది. కొందరి పరిష్కారం దానికో గుర్రాన్ని కట్టి దాన్ని ఓ చర్నాకోలాతో కొట్టడం. కాని ఏ కార్పోరేట్ కంపెనీ బాస్ పరిష్కారమైనా ఓ గుర్రాన్ని మూడు చర్నాకోలలతో కొట్టాలన్నది. మీ అక్కది డిఫరెంట్ అప్రోచ్. అసలైన బ్రిలియంట్ మైండ్. మొన్న వర్క్‌షాప్‌లోకి వెళ్ళినప్పుడు 'నో స్మోకింగ్ బోర్డ్' సైన్ కింద కూర్చుని సిగరెట్లు తాగే ఇద్దరు వర్కర్స్‌ని చూసింది.

'కళ్ళులేవా? ఆ బోర్డ్‌ని చదవలేదా?' అని తిట్టలేదు. వాళ్ళకి మెమో ఇవ్వలేదు.

సిగరెట్ పాకెట్స్‌ని తెప్పించి ఇద్దరికీ చెరొకటి ఇచ్చి, 'మీరీసారి ఫేక్టరీ బయటకి వెళ్ళి వీటిని తాగితే సంతోషిస్తాను ' అని చెప్పింది.

ఆ తర్వాత వాళ్ళే కాదు. ఏ వర్కరూ మళ్ళీ ఆ వర్క్ షాప్‌లో సిగరెట్ తాగలేదు. మేనేజింగ్ పీపుల్ ఈజ్ ఇంటలిజెన్స్. ఘానాలో వర్కర్స్ బద్ధకస్తులు. వారితో సరిగ్గా పని చేయించుకునే తెలివితేటలు మేనేజర్‌కి అవసరం. ఓ వర్క్ షాప్‌లోని కొందరు కష్టపడి పనిచేస్తే, కొందరు బద్ధకంగా పని ఎగ్గొట్టడం గమనించాక, మీ అక్క వర్కర్స్‌ని రెండు టీములుగా విభజించి, ఏ టీం ఎక్కువ ఉత్పత్తి చేస్తే వారికో షీల్డ్ ఇవ్వసాగింది. షీల్డ్‌ని కోరనివారెవరు? దాంతో రెండు టీములలోని వాళ్ళు పోటీ పడి పనిచేసారు. పనిచేయని తమ టీములోని వారి చేత కూడా మిగిలినవారు పనిచేయించారు. పోటీతత్త్వం మనిషిలో అధికం. దాన్ని చైత్ర చక్కగా ఉపయోగించుకుంది. దాన్నే మెనెజీరియల్ కెపాసిటీ అంటాను" అలెక్సీ చెప్పాడు.

"నువ్వు సదా ఆనందంగా, ఉత్సాహంగా కనపడతావు కదా? దుఃఖం వస్తే ఏం చేస్తావు?" ఆద్య అడిగింది.

"నాకు దుఃఖం వచ్చినప్పుడు సర్కస్ గుడారాన్ని విప్పి మడతపెట్టి, దాన్ని పెట్టెలో ఉంచేవాడి పనిని గుర్తు తెచ్చుకుంటాను. సాధారణంగా వెంటనే నాది దుఃఖం కాదు అనిపిస్తుంది."

"నువ్వసలు ఎన్నటికీ దుఃఖాన్ని అనుభవించలేవు పో" చైత్ర నవ్వుతూ చెప్పింది.

"నీకు ఏ దేశం నచ్చింది?" ఆద్య ఇలియాని అడిగింది.

"నార్వే తప్ప అన్ని దేశాలు."

"మేం ఇంతదాకా ఉన్న బర్గన్ మోస్ట్ డిప్రెసింగ్ టౌన్" అలెక్సీ చెప్పాడు.

"ఎందుకని?"

"సంవత్సరానికి ఐదు రోజులే వర్షం పడదు. ఎప్పుడూ ఆకాశం నిండా మేఘాలే. నిత్యం గొడుగు తీసుకెళ్ళాల్సిందే. ఎప్పుడైనా మూడు, నాలుగు నెలలకోసారి నీలం రంగు ఆకాశం కనిపిస్తే చాలు చాలామంది ఒంట్లో బాలేదని ఆఫీస్‌కి రారు. ఆ వెదర్ని ఎంజాయ్ చేయడానికి వెళ్తారు. పైగా మేం ఉన్న అన్ని దేశాల్లోకి చాలా ఖరీదైన దేశం నార్వే. నార్వేలో

లేబర్ లాస్ వేరేగా ఉంటాయి. ఐదు తర్వాత ఆఫీస్‌లో పని చేయమనకూడదు. సెలవ రోజుల్లో వారికి పని విషయంలో ఫోన్ చేసినా అది వర్కింగ్‌డేగా కౌంట్ చేస్తారు. కాని నార్వే ఫేమ్లీ ఫ్రెండ్లీ దేశం. బిడ్డ పుడితే తల్లికి ఏడాది, తండ్రికి పన్నెండు వారాలు సెలవుని ఇస్తారు. సెర్జీ అక్కడే పుట్టాడు. కాబట్టి మేమూ సెలవుని ఎంజాయ్ చేసాం. బిడ్డ పుట్టాక వాడి సంక్షేమం ప్రభుత్వమే చూసుకుంటుంది. ఉచిత వైద్యం, ఉచిత విద్య. అరవై ఏళ్ళు దాటిన ప్రతి పౌరుడికీ ప్రభుత్వం నెలకి వెయ్యి యు.ఎస్. డాలర్లకి సమానమైన పెన్షన్ ఇస్తుంది. అక్కడ డాక్టర్‌కి ఓ విజిట్‌కి చెల్లించాల్సింది ఇరవై ఒక్క డాలర్లు. ఏడాదిలో అలా పద్దెనిమిది వందల పదిహేడు డాలర్లు చెల్లించాక ఇక కన్సల్టేషన్ ఫీజ్ చెల్లించక్కర్లేదు. సంవత్సరంలో నియమిత కర్చులకి మందులు కొన్నాక మిగిలిన మందులన్నీ ఉచితం. క్రైం రేట్ చాలా చాలా తక్కువ. అక్కడ సగటున ఎనభై ఒక్క ఏళ్ళు జీవిస్తారు. నార్వేకి చాలా దేశాల్లా 'సావరిన్ వెల్త్ ఫండ్ ' ఉంది. ఇంకా..."

"సావరిన్ టేక్స్ ఫండ్?" ఆద్య అడిగింది.

"చెప్తాను. ప్రభుత్వం టేక్స్‌లుగా కలెక్ట్ చేసిన సొమ్ములోంచి మిగిలింది లండన్, దుబాయ్‌లాంటి చోట్ల పెట్టుబడులు పెట్టి సంపదని పెంచుతోంది. ఎన్.బి.ఎం.ఎన్‌వో అనే నార్వే వెబ్‌సైట్‌లో ఎవరైనా అదెంతో చూడచ్చు.." అలెక్సీ తన మొబైల్లో చూసి చెప్పాడు.

"ఇవాళ్టికి దాని విలువ ఒన్ పాయింట్ ఫోర్ ట్రిలియన్ డాలర్స్. మిలియన్ అంటే ఆరు సున్నాలు. బిలియన్ అంటే తొమ్మిది సున్నాలు. ట్రిలియన్ అంటే పన్నెండు సున్నాలు. నార్వే జనాభా నాలుగు లక్షలు. అంటే తలసరి సంపద ఎంతంటే.. ఇరవై ఎనిమిది లక్షల క్రోనర్స్" లెక్కకట్టి చెప్పాడు.

"కావాలంటే ఎవరైనా ఎప్పుడైనా తమ భాగాన్ని తీసుకోవచ్చా?" ఆద్య అడిగింది.

"నో. ఇది థియెరెటికల్ ఫండ్ మాత్రమే. దీన్నించి వచ్చే ఆదాయంతోనే వాళ్ళు ప్రజా సంక్షేమానికి ఖర్చు చేస్తారు. ఇండియాకి కూడా ముప్పై ఆరు లక్షల కోట్ల రూపాయల సావరిన్ ఫండ్ ఉంది. అది తలసరి ఇరవై ఆరువేల రూపాయలకి సమానం" చైత్ర నవ్వి చెప్పింది.

"కతార్, యు.ఏ.ఈ, ఒమాన్, బెహరిన్, సౌదీలాంటి చాలా సంపన్న దేశాలకి కూడా ఇలాంటి సావరిన్ వెల్త్ ఫండ్స్ ఉన్నాయి. సింగపూర్‌ది అన్నిటికన్నా ఎక్కువ. ఒన్ పాయింట్ నైన్ ఫైవ్ ట్రిలియన్. తర్వాతి స్థానం చైనా ఒన్ పాయింట్ సెవెన్. మలేసియా ఫండ్ మేనేజర్ ఆ డబ్బుతో ఉడాయించాడు. దాని ప్రైమ్ మినిస్టర్ని జైల్లో పెట్టారు. కాని బయటకి వచ్చేసాడు. ఇంతదాకా ఆ ఫండ్ మేనేజర్ దొరకలేదు. చెప్పాగా. రైట్ కంట్రీ ఇన్ బేడ్ హేండ్స్ అంటే ప్రజాస్వామ్యమని."

"నేను వచ్చేవారం అక్రా వెళ్ళిపోతున్నాను. పిల్లల వెకేషన్ అయిపోతుంది" ఇలియా విచారంగా చెప్పింది.

"ఇక్కడ స్కూల్స్‌లో కనీసం టెంత్ దాకా అయినా ఉండాల్సింది" చైత్ర చెప్పింది.

"ఉన్నాయి. కాని అవి ఇంటర్నేషనల్ స్టాండర్డ్‌లో ఉండవు. అది ముఖ్యం" ఇలియా చెప్పింది.

వాళ్ళు కాసేపు కబుర్లు చెప్పాక సెలవు తీసుకున్నారు. పిల్లలకి నచ్చడంతో చైత్ర మిగిలిన పీతల కూరని వాళ్ళు వెళ్ళేప్పుడు ప్లాస్టిక్ బాక్స్‌లో పెట్టి ఇచ్చింది.

వాళ్ళ గురించి కొద్దిసేపు మాట్లాడుకున్నాక అక్కచెల్లెళ్ళు గుడ్‌నైట్ చెప్పుకుని ఎవరి పడక గదుల్లోకి వాళ్ళు వెళ్ళారు.

28

మెలుకువ వచ్చిన ఆద్య బద్ధకంగా మంచం మీంచి లేవకుండా పడుకుని కిటికీలోంచి బయట చెట్లని చూడసాగింది. ఆమె ప్రయాణం దగ్గరకొచ్చింది. చైత్ర రెండు రోజులుగా వెదర్ రిపోర్ట్ని పరిశీలిస్తోంది. సహారాలో ఇసక తుఫాను వస్తే టకరోడీనించి అక్రాకి వెళ్ళే ఏకైక విమానం రద్దవుతుంది.

చైత్రనించి వచ్చిన టెక్స్ట్ మెసేజ్ ఆమె లేచేసరికి ఎదురు చూస్తోంది.

"రాత్రికి డిన్నర్‌కి వెళ్తున్నాం. నేను రాగానే నా కొలీగ్ ఇంటికి వెళ్దాం."

లేచి తయారై కాఫీ తాగుతూ టి.వి ఆన్ చేసింది. సి.ఎన్.ఎన్.లో తెలివైన ఉత్పత్తుల గురించిన ప్రోగ్రాం ఆసక్తిగా ఉండటంతో బి.బి.సిఛానల్లోకి వెళ్ళలేదు.

2జిబి పెన్ డ్రైవ్‌లో ధర్మా మీటర్లోలా జీరో, 20%, 40%, 60%, 80%, 100% కనిపిస్తూంటాయి. తెల్లగీత ఎంతదాకా ఉంటే ఆ యు.ఎస్.బిలో అంతదాకా లోడైనట్లు. దానివల్ల ఎప్పటికప్పుడు ఎంత స్టోరేజ్ ఇంకా మిగిలి ఉందో తెలుస్తుంది. రెడీమేడ్ దుస్తుల దుకాణంలో ట్రయల్ రూములో లైట్‌కి మూడు రకాల స్విచ్‌లు ఉన్నాయి. వాటిమీద డాన్, డస్క్, నైట్ అని రాసి ఉంది. ఆ బటన్ని నొక్కితే ఆ సమయంలోని లైట్‌కి సరిపడే కాంతే బల్బ్ నించి వెలువడుతుంది. దీనివల్ల ఆ సమయాల్లో ఆ దుస్తుల రంగు ఎలా కనిపిస్తుందో కొనుగోలుదారు తెలుసుకోవచ్చు.

ఓ రోడ్‌కున్న ఇనపకంచెని రోడ్‌వైపు బెంచీల్లా వంచారు. అక్కడ కూర్చుని రిలాక్స్ అవచ్చు.

రాత్రుళ్ళు చీకట్లో వస్తే ఇంటిముందు సెన్సర్ లైట్లు వెంటనే వెలుగుతాయి. బాత్‌రూములోకి వెళ్ళగానే కూడా వెలుగుతాయి.

లాంతరు వత్తిలా ఎలక్ట్రిక్ లైట్ బల్బ్‌నించి వచ్చే కాంతిని స్విచ్‌ని పైకి, కిందకి జరిపి పెంచి, తగ్గించుకునే ఏర్పాటుంది. దాన్నే పడకగదిలో బెడ్ లాంప్‌గా ఉపయోగించుకోవచ్చు.

లిఫ్ట్‌లో ఎందరు ఎక్కచ్చో చూపించే అంకెలు లిఫ్ట్ బరువుని బట్టి పదిహేనునించి కిందకి కౌంట్ దిగుతూ కనిపిస్తుంది. ఆఖరి వ్యక్తి కూడా ఎక్కాక 'ఫుల్. డోంట్ ఎంటర్ ' అని చూపిస్తుంది.

లిఫ్ట్ పక్కన మెట్లు పియానో మెట్లు నలుపు, తెలుపుల్లో ఉన్నాయి. వాటిమీద నడుస్తూంటే పియానో సంగీతం వినిపిస్తుంది. అది లిఫ్ట్ ని బదులు మెట్లని ఉపయోగించడాన్ని ప్రోత్సహిస్తుంది. ముఖ్యంగా పిల్లలు ఆ మెట్లవైపు

పరిగెత్తడంతో వారివెంట వచ్చిన పెద్దవాళ్ళు కూడా విధిగా మెట్లనే ఉపయోగిస్తారు. లిఫ్ట్ వినియోగంలోని కరెంట్ కూడా ఆదా అవుతుంది.

ఓ రెసిడెన్షియల్ కారిడార్ చివర లిఫ్ట్ ఉంది .కారిడార్లోకి తలుపు తెరచుకుని వచ్చినవారు తలుపు పక్కనున్న లిఫ్ట్ బటన్‌ని నొక్కితే, వారు లిఫ్ట్ దగ్గరకి నడిచి చేరుకునేసరికి లిఫ్ట్ ఆగి, తలుపులు తెరుచుకుంటాయి. లిఫ్ట్ దగ్గర వేచి ఉండాల్సిన సమయం తగ్గుతుంది.

కోపెన్‌హేగన్‌లో సైకిల్‌మీద వెళ్ళేవాళ్ళ సౌకర్యం కోసం ఆగకుండా దాంట్లో చెత్తని వేసే సౌకర్యం కోసం రోడ్‌మీది చెత్త డబ్బాలు ఏటవాలుగా ఉంటాయి.

టోక్యోలో మల్టీ స్టోరీ ఆఫీస్ బిల్డింగ్‌లో బయట వర్షం పడుతూంటే, గొడుగు మర్చిపోయినవారు వెనక్కివెళ్ళి దాన్ని తీసుకోడానికి వీలుగా లిఫ్ట్ బయట గొడుగుమీద వానపడే బొమ్మ మానిటర్లో కనిపిస్తుంది.

గొడుగు అంచులనించి కిందదాకా వేలాడే ట్రాన్స్‌పరెంట్ ప్లాస్టిక్ షీట్‌వల్ల తడవరు. ఎటువైపైనా చూడచ్చు.

మందులుంచే పెట్టె మూతమీద ఎంతకాలం క్రితం దాన్ని తెరిచారో డిజిటల్ క్లాక్ చూపిస్తుంది. ఫలానా టైముకి మందు వేసుకున్నామా, లేదా అన్న అనుమానం ఆ టైముని చూస్తే తీరుతుంది. ఆ పెట్టలోంచి మందు వేసుకునే సమయానికి సెట్ చేసుకున్న అలారం మోగి టైమైందని హెచ్చరిస్తుంది.

చూపుడు వేలుకి తగిలించుకునే ప్లాస్టిక్ టూత్ బ్రష్‌మీద పేస్ట్ వేసుకుని వేలితో పళ్ళు తోముకోవచ్చు.

కళ్ళల్లో డ్రాప్స్ వేసుకోడానికి ధరించే కళ్ళజోడుకి అద్దాలు ఉండాల్సిన చోట డ్రాప్స్ పోసే రెండు గరాటాలు ఉంటాయి.

అవన్నీ ఆద్య చాలా ఆసక్తిగా చూసింది. వాటిని కనిపెట్టింది ఇంజనీర్లే. ముందా సౌకర్యం గురించి ఆలోచించాలి. తర్వాత దాన్ని రూపొందించాలి. ఇంజనీర్లు గ్రేట్ అనుకుంది.

అనస్థాషియా వచ్చి కబుర్లు చెపుతూ పని చేసుకుని వెళ్ళింది.

సాయంత్రం చైత్ర వచ్చాక డ్రస్ మార్చుకుంది.

"ఐదు నిమిషాల్లో బయలుదేరుదాం" చెప్పింది.

"అప్పుడే భోజనానికా?" ఆద్య ఆశ్చర్యంగా అడిగింది.

"అవును. ఖాలెద్ ఇంటికి. సైమన్ మనల్ని డ్రాప్ చేసి మళ్ళీ రాత్రి పదికి మనల్ని పికప్ చేస్తాడు."

"ఖాలెద్ ఎక్కడున్నాడని నువ్వు రెండు మూడుసార్లు అందర్నీ అడగడం విన్నాను. అతనేనా?" అడిగింది.

"అవును. అతనిదో విషాద గాథ" చైత్ర నిట్టూర్చి చెప్పింది.

"విషాదగాథలు ఎప్పుడూ ఆసక్తిగా ఉంటాయి. చెప్పు" ఆద్య ఆసక్తిగా అడిగింది.

"తెలుగైతే మన వాహన సారధికి అర్ధంకాదు. దారిలో తెలుగులో చెప్తాను. రెడీ అవ్వు."

ఇద్దరూ బయలుదేరారు.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**

www.anandbooks.com
www.telugubooks.in